

కాలేజీలో అధ్యాపకులలోను, విద్యార్థులలోను
క్రమశిక్షణ నెలకొల్పటానికి వారే ప్రధానకారకులు

# రాజీలేని వ్యక్తి

## డాక్టర్ కాసరనేని సదాశివరావు

రోశయ్యగారిని మొదటిసారి చూడడం 1940 వారి వివాహ సమయంలో. ఆ పెండ్లికి హాజరయింది బహుకొద్దిమంది పెద్దలు. ఆహ్వానం లేకుండ వెళ్ళినమాబోటి విద్యార్థులు మరికొంతమంది. ఆ పెళ్ళికి ఆహ్వానించబడ్డ పెద్దలు ఎక్కువమంది boycott చేశారు. కారణం-వితంతు వివాహము గావటమే. మాకు అంటే M.A. చదివే విద్యార్థులకు వితంతు వివాహము చూడటంగూడ క్రొత్తే. అందువలన ఆహ్వానము లేకపోయినా మేము వెళ్ళటం తటస్థించినది. ఆ తరువాత 2 సంవత్సరములకు Medical College లో చేరటానికి ముందు వారిని ప్రత్యక్షంగా కలిసికొని వారి ఆశీస్సులు పొందటం జరిగింది. అప్పటినుండి మేము సన్నిహితంగా మెలుగుతూ వచ్చాము.

శ్రీ రోశయ్యగారు సామాన్యకుటుంబము నుండి చాలా శ్రమతో విద్యాభ్యాసముజేసి 1941లో M.A. డిగ్రీని సంపాదించిరి. హైస్కూలు విద్య గుంటూరు జిల్లా తురుమెళ్ళలో. ఆరోజుల్లో తురుమెళ్ళ హైస్కూలు, ఆ స్కూలు హెడ్మాస్టర్ శ్రీ దక్షిణామూర్తిగారు, ఒక్క గుంటూరు జిల్లాలోనేగాకుండ, ఉమ్మడి మద్రాసు రాష్ట్రములో గణుతికెక్కినారు.

దక్షిణామూర్తిగార్కి ప్రియశిష్యులై, వారి కార్యదీక్ష, పట్టుదల మొదలైన సద్గుణాలను ఉన్నత విద్యా విలువలను అలవరచుకొని నిత్యనిజజీవితంలో చివరివరకు పాటించినవారు రోశయ్యగారు. అందువల్లనే, వీరు మారేకాలంతోపాటు మారలేకపోయారు. కొంతమంది విమర్శకు గురియైనారుగూడ.

వీరు M.A. (English Literature) మద్రాసు యూనివర్సిటీ నుండి థర్డ్ క్లాసులో పాసైనారు. దానిని గురించి నేను వారినెప్పుడూ అడిగి తెలిసికోలేదు గాని కొంతమంది పెద్దలు జెప్పిన కథనం ప్రకారం వీరి చదువు లోతును గురించి వారి ప్రొఫెసర్ గారికి కలిగిన మాత్సర్యమే కారణం.

దురదృష్టవశాత్తు నేటికి మన గురుకులములో పరశురాముని, ద్రోణాచార్యులవారి సంతతివారు అక్కడక్కడ తటస్థపడుతూనే వున్నారు. పరశురాముడు కర్ణునిపట్ల ప్రవర్తించిన కర్కశ విధానం, ద్రోణాచార్యులవారు ఏకలవ్యుని విషయంలో ప్రవర్తించినతీరు గురుకులానికే మాయనిమచ్చ. విద్యార్థి దశలో ఉత్తమ గురువులను పొందగలిగిన మాలాంటి వారికి ఆ బాధ తెలియదు గాని, రోశయ్యగారు ఎట్లా మరచిపోగలరు? కాని ఎప్పుడూ పొరపాటునగూడ ఆ విషయం ప్రస్తావించేవారుగాదు.

అధ్యాపకునిగా, కొన్నాళ్ళు గుంటూరు ఏ.సి. కాలేజిలోను, భీమవరం D.N.R. College లోను పనిజేయడం జరిగింది. గుంటూరు కమ్మహాస్టలుకు చాలాకాలం వార్డెన్‌గా పనిజేసిరి. ప్రతిరోజు రాత్రి 11, 12 గంటల వరకు హాస్టలులోఉండి విద్యార్థులను చదివించటమేగాకుండ, వారి భోజన విషయములో చాల ప్రత్యేక శ్రద్ధ తీసికొని, విద్యార్థుల ప్రేమను పొందగలిగారు.

1968 సంవత్సరంలో గుంటూరు నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటివారు, జాగర్లమూడి కుప్పుస్వామి కళాశాలను ప్రారంభించేటప్పుడు, వారిని ఇంగ్లీషు డిపార్టుమెంట్ హెడ్‌గాను, వైస్

ప్రిన్సిపాల్‌గాను తీసికోడం జరిగింది. అదే సంవత్సరములో Principalగా గూడ నియమింపబడ్డారు. అప్పటి నుండి, 1976లో రిటైర్ అయ్యేవరకు, కాలేజీని దీక్షతో నిర్వహించారు. ఆ కాలంలో నేను కాలేజి సెక్రటరీ కరెస్పాండెంట్‌గా ఉండటం యాదృచ్ఛికమే. కాలేజీలో అధ్యాపకులలోను, విద్యార్థులలోను క్రమశిక్షణ నెలకొల్పటానికి వారే ప్రధానకారకులు.

అయితే అదే కాలంలో కొంతమంది పెద్దల మనసులను గాయపరచటం గూడ జరిగింది. తన విధినిర్వహణలో అట్లా జరిగియుండవచ్చు కాని ఉద్దేశ్యపూర్వకంగా మాత్రం చేయలేదనివారు అభిప్రాయపడుతూ వుండేవారు. వీరు ఆంగ్లములోనే గాక తెలుగుభాషలో మొదటిశ్రేణికి జెందిన పండితులన్న విషయం యావదాంధ్ర దేశం తెలిసిన విషయమే. ముఖ్యంగా వ్యాకరణ విషయంలో, గ్రాంధిక భాష విషయంలో ఏ మాత్రము రాజీలేని వ్యక్తి.



డాక్టరు సదాశివరావుగారితో